# 3

# విధేయత: దేవుని అభీష్ట పరిమాణములు

*"ఈ గ్రంథమందున్న ప్రవచన వాక్యమును విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా – ఎవడైనను వీటిలో మరి ఏదైనను కలిపినయెడల, ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్లు దేవుడు వానికి కలుగజేయును; ఎవడైనను ఈ ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసినయెడల, దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవ వృక్షములోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండ చేయును" (ప్రకటన 22:18, 19).*

మన కళ్ళకు చిన్న సంగతిగా కనబడునది దేవునికి చాలా ప్రాముఖ్యమైనదై యుండువచ్చును. జాన్. యల్. గీరార్డ్యూ దేవునికి విధేయత చూపించుటకు మన విధానము ఏమైయుండాలో సంగ్రహముగా వ్యక్తపరచెను:

> ప్రతీ సిద్ధాంతమునకు, ప్రభుత్వానికి, సంఘ ఆరాధనకు ఒక దైవికమైన అధికారం అవసరం; వీటికి సంబంధించిన వాటిని గూర్చి లేఖనములలో లేక ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఆజ్ఞాపింపనివి నిషేధించబడినవి.[1]

## అధికారపు సిద్ధాంతములు

ఒక ఆచారము (పద్ధతి) దేవుని అంగీకారము కల్గియున్నది లేనిది నిర్ధారించుటకు నాలుగు సిద్ధాంతములను అర్థము చేసుకొనవలసియున్నది.

(1) దేవుడు రూఢిగా ఆజ్ఞాపించియున్నట్టయితే లేదా ఒక ఆచారమును గురించి ప్రతిపాదించియున్నట్టయితే మనము దానికి విధేయులము కావలెను. "ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని" బాప్తిస్మము పొందినవారికి అపొస్తలులు బోధించవలెనని యేసు చెప్పినప్పుడు ఈ సూత్రాన్ని తెలియజేశాడు (మత్తయి 28:20ఎ).

(2) దేవుడు ఒక ఆచారమును నిషేధించియుంటే, మనము దానిని విడిచిపెట్టాలి. కొండమీద ప్రసంగములో చేయకూడదు అనేది కన్పిస్తుంది. "మీరు ప్రార్థన చేయునప్పుడు అన్యజనులవలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు" (మత్తయి 6:7ఎ); "మీరు ఉపవాసము చేయునప్పుడు వేషధారులవలె దుఃఖముఖులైయుండకుడి" (మత్తయి 6:16ఎ).

(3) దేవుడు ఒక ప్రత్యేకమైన ప్రాంతములో ఆచరించుటకు ఒక ఎన్నిక (కోరిక) గూర్చి తెలియజేసినట్టయితే, మనము ఎన్నికకు బద్ధులమై యుంటాము. ఈ సూత్రము నిజము కానట్టయితే, అప్పుడు దేవుని కోరిక మనకోరిక కంటె అగ్రగామిగా ఉండదు. దేవుడు ఇశ్రాయేలీయుల పండ్రెండు గోత్రములలోనుండి లేవీ గోత్రికులను మత సంబంధమైన సేవల భారము కల్గియుండుటకు ఎన్నుకొనెను (సంఖ్యాకాండము 1:50). యితర గోత్రికులెవ్వరు పరిశుద్ధ స్థలములో సేవచేయకూడదని దీని అర్థం.

దేవుడు ధర్మశాస్త్రములో ఆయన కోరికను వ్యక్తపరచియున్నందున ధర్మశాస్త్రము అమలులో ఉన్నంతవరకు యేసు యాజకుడు కాలేకపోయెను. యేసును (యూదా

గో(త్రమునుండి) ధర్మశాస్త్రమునకు విరుద్ధముగా యాజకుడుగా సేవచేయుటకు నియమించి దేవుడు ఆయన ఎన్నికను భంగము చేయలేదు.

దేవుడు ఏమిచేశాడో వివరిస్తూ, అందువలన యేసు యాజకుడు కాగలడని హెబ్రీ గ్రంథకర్త వ్రాసెను,

> ఇదియుగాక యాజకులు మార్చబడినయెడల అవశ్యముగా యాజక ధర్మము సహా మార్చబడును. ఎవనిని గూర్చి యీ సంగతులు చెప్పబడెనో ఆయన వేరొక గోత్రములో పుట్టెను. ఆ గోత్రములోని వాడెవడును బలిపీఠమునొద్ద పరిచర్య చేయలేదు. మన ప్రభువు యూదా సంతానమందు జన్మించెననుట స్పష్టమే; ఆ గోత్ర విషయములో యాజకులను గూర్చి మోషే ఏమియు చెప్పలేదు (హెబ్రీయులకు 7:12–14).

దేవుడు వేటిని ప్రత్యేకించి చెప్పాడో అవే దేవుడు ఎన్నిక చేసినవాటిలో చేర్చబడి యుండును. ఆయన ఎన్నుకొన్నవాటినే చేయవలనని ఆయన మౌనం తెలుపుతుంది. దేవుడు ఎన్నిక చేసియుంటే ఆ పరిధిలో మరొకటి ఆచరింపకూడదు.

(4) దేవుడు ప్రత్యకించి కోరనప్పుడు, మన సొంత విచక్షణ ప్రకారము మనకు స్వతంత్ర్యత ఉంటుంది. ఆహారము తినుట మరియు దినములు ఆచరించుటను గురించి వ్రాసినప్పుడు పౌలు దీనిని ఉదహరించాడు (రోమీయులకు 14:2–6). దేవుడు క్రైస్తవుల ఆహారమును గురించి ఏ ఎన్నిక చేసియుండలేదు, కనుక మనము ఆ విషయములలో స్వేచ్ఛ కల్గి ఎన్నుకొనవచ్చును.

ఈ సూత్రములను ప్రభువు రాత్రి భోనమునకు లేదా ఏ యితర ఆచారములకు అన్వయించగలము. ఒక ఉదాహరణను ఆలోచించుదుము, ప్రభువు రాత్రి భోజనము:

(1) ప్రభువు భోజనము చేయుట ఆజ్ఞాపించబడెను (1 కొరింథీయులకు 11:23–26), కనుక అది గైకొనవలెను.

(2) విగ్రహములకు బలి అర్పించిన వాటిని తినుటను నిషేధించవలెను (1 కొరింథియులకు 10:19–21) మరియు అభ్యసించకూడదు. క్రైస్తవులు ప్రభువు పాత్రలోనిది దయ్యముల పాత్రలోనిది త్రాగకూడదు.

(3) యేసు రొట్టెను మరియు ద్రాక్షారసమును ఏర్పరచెను (మత్తయి 26:26–29). దానితోపాటు ఏ ఇతర ఆహారము లేదా పానము పేరు చెప్పలేదు, కనుక మనము జున్ను లేదా మాంసమును రొట్టెపై ఉంచకూడదు.

(4) గిన్నె యొక్క రకమును ఏర్పరచి యుండలేదు, గిన్నె ఏ పదార్థముతో చేసియుండాలో, లేదా దానిలోనివి కూడినవారికి ఎలా పంచాలో చెప్పలేదు. ఈ విషయములలో క్రైస్తవులు ఎన్నుకొనుటకు స్వేచ్ఛ కలిగియున్నారు.

## అధికారమునకు మూలములు

**పరలోకము లేదా మనుష్యులా?**

మత సంబంధమైన ఆచారములు పరలోకమునుండి లేదా మనుష్యులనుండి రాగలవు – దేవునినుండి లేదా దయ్యముల ప్రభావితమువలన మనుష్యులనుండి వచ్చును (2 కొరింథీయులకు 11:13–15). “యోహాను యిచ్చిన బాప్తిస్మము పరలోకమునుండి

కల్గినదా అని యేసు యూదులనడిగెను" (మత్తయి 21:25; మార్కు 11:30; లూకా 20:4). ప్రతి మత సంబంధమైన ఆచార విషయములలో అడుగదగిన ఒక ముఖ్యమైన ప్రశ్నయిది. అది పరలోకమునుండి కలిగితే – అది బైబిల్‌నందు తెలియజేయబడితే – అప్పుడు అది దేవునినుండి కలిగినట్టు. ఒక వ్యక్తి తన కోరిక చొప్పున ఒక విషయం ఎన్నుకుంటే, ఇదివరకే దేవుడు ఆ విషయములో ఒక ఏర్పాటు చేసియుంటే, అప్పుడు ఆ వ్యక్తి ఎన్నుకొన్నది దేవునిచేత ఆమోదింపబడియుండలేదు.

ఇశ్రాయేలీయులు వారి తెరలమీద దేవుని ఆజ్ఞలను వ్రాసుకొవలెనని ఆజ్ఞాపించెను. అప్పుడు ఆయన ఉద్దేశమును వివరించెను:

> మీరు ఆ ఆజ్ఞలన్నిటిని జ్ఞాపకము చేసికొని మీ దేవునికి ప్రతిష్ఠితులైయుండునట్లు మునుపటివలె కోరినవాటిని బట్టియు చూచిన వాటినిబట్టియు వ్యభిచరింపక, దాని చూచి యెహోవా ఆజ్ఞలన్నిటిని జ్ఞాపకము చేసికొని వాటిననుసరించుటకే అది మీకు కుచ్చుగానుండును (సంఖ్యాకాండము 15:39, 40).

ఈ ఉపదేశము అనుకూలార్థముగాను, మరియు వ్యతిరేకార్థము గాను చెప్పెను: దేవుని ఆజ్ఞలన్నియు ఇశ్రాయేలీయులు చేయవలసియుండెను మరియు వారి సొంత హృదయములు నేత్రములు మొగ్గు చూపినట్లు వారు *చేయకూడదని* చెప్పెను.

ఒక ఉపదేశము లేదా ఆచారము లోకము దృష్టిలో సరియైనదిగా *కనబడవచ్చును* కానీ తుదకు అది మరణమునకు దారితీయును (సామెతలు 14:12). ధర్మశాస్త్రమను ప్రమాణ వాక్యమును వారు బోధించనియెడల వారికి అరుణోదయము కలుగదు (యెషయా 8:20 చూడు). మానవుని త్రోవలు దేవుని త్రోవలవంటివి కావు (యెషయా 55:8, 9); మానవ మార్గము వాని వశములో లేదు (యిర్మీయా 10:23). హృదయము మోసకరమైనది (యిర్మీయా 17:9); అందువలన, తన మనస్సును నమ్ముకొనువాడు బుద్ధిహీనుడు (సామెతలు 28:26).

న్యాయాధిపతుల కాలంలో ప్రతివాడు తన ఇష్టానుసారముగా ప్రవర్తించుట ఇశ్రాయేలీయుల పాపమైయుండెను (న్యాయాధిపతులు 17:6; 21:25). దేవుని మార్గములనుండి తొలగినవారు "తిన్నని మార్గమును" విడచిరని పేతురు తెలిపెను (2 పేతురు 2:15). ఆయన దృష్టిలో ఏది నిజమైనదో ప్రతివారు అది చేయాలని దేవుడు కోరుతున్నాడు (ద్వితీయోపదేశకాండము 13:18).

ఇశ్రాయేలీయులు వారి చుట్టు ప్రక్కల ఉన్న జాతుల ఆచారములను ఆచరింపక దేవుని ఆజ్ఞలను అనుసరించవలెనని ఆయన వారిని హెచ్చరించెను.

> "మీరు నివసించిన ఐగుప్తు దేశాచారముల చొప్పున మీరు చేయకూడదు; నేను మిమ్మును రప్పించుచున్న కనాను దేశాచారముల చొప్పున మీరు చేయకూడదు; వారి కట్టడలనుబట్టి నడువ కూడదు. మీరు నా విధులను గైకొనవలెను; నా కట్టడలను బట్టి నడుచుకొనుటకు వాటిని ఆచరింపవలెను" (లేవీయకాండము 18:3, 4).

> "నేను మీ యెదుటనుండి వెళ్లగొట్టుచున్న జనముల ఆచారములనుబట్టి నడుచుకొన కూడదు. వారు అట్టి క్రియలన్నియు చేసిరి గనుక నేను వారియందు అసహ్యపడితిని" (లేవీయకాండము 20:23).

**దేవుడా లేదా అపవాదా?**

యేసు యూదులనుద్దేశించి,

> మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీ తండ్రి దురాశలు నెరవేర్చ గోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడైయుండి సత్యమందు నిలిచినవాడు కాడు; వానియందు సత్యమే లేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునై యున్నాడు (యోహాను 8:44).

సాతాను హవ్వను మోసపరచెను (ఆదికాండము 3:1-4; 2 కొరింథీయులకు 11:3; 1 తిమోతి 2:14). పౌలు బోధలు తొలగింపవలెనని ఎలుమ అపవాదిచే త్రిప్పబడెను (అపొస్తలుల కార్యములు 13:8-10). దయ్యముల ప్రభావమువలన సత్యమునుండి తొలగించువారు వస్తారని చెప్పబడింది (1 తిమోతి 4:1, 2).

## అధికారము యొక్క ఉదాహరణలు

యేసు పరిచర్య చేయునప్పుడు జనులకు పలు ఉపదేశములు చేసెను. ప్రతి ఆజ్ఞకు విధేయత అవసరము:

- "... నీవు లేచి నీ మంచమెత్తుకొని నీ యింటికి పొమ్ము" (మత్తయి 9:6బి).
- "... సముద్రమునకు పోయి, గాలమువేసి, మొదట పైకివచ్చు చేపను పట్టుకొని ... ఒక షెకెలు దొరుకును; దానిని తీసికొని నాకొరకును నీకొరకును వారికిమ్మని అతనితో చెప్పెను" (మత్తయి 17:27).
- "మీ యెదుటనున్న గ్రామమునకు వెళ్ళుడి; కట్టబడియున్న యొక గాడిదయు దానితోనున్న యొక గాడిద పిల్లయు మీకు కనబడును. వాటిని విప్పి నాయొద్దకు తోలుకొని రండి" (మత్తయి 21:2).
- "దోనెను లోతుకు నడిపించి, చేపలు పట్టుటకు మీ వలలు వేయుడి ..." (లూకా 5:4బి).
- "... వెళ్ళి యాజకునికి చూపించుకుని మరియు కానుకలు సమర్పించుము" (లూకా 5:14).

యేసు వద్దనుండి దీవెన లేదా వాగ్దానము పొందుటకు పై విషయములలో ఆయన చెప్పినట్లు ఖచ్చితముగా చేయవలసియుండెను. అలాగు చేయనియెడల వారు ఆయనకు విధేయులయ్యుండెడివారు కాదు.

**మత్తయి 28:20**

"నేను మీకు ఏ యే సంగతులు ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని" (మత్తయి 28:19, 20ఎ) ఆయన భూమిమీదనుండి వెళ్ళకమునుపు, వారు ఎవరికి బాప్తిస్మమిస్తారో వారందరికి బోధించమని యేసు తన శిష్యులకు చెప్పాడు. సంఘపు ప్రారంభ దినములలో వారు దీనిని సంపూర్తిగా చేసిరి. బాప్తిస్మము పొందినవారు అపొస్తలుల బోధయందు ఎడతెగక ఉండిరి (అపొస్తలుల కార్యములు 2:42ఎ) గనుక దీనిని సంఘ ఆరంభ దినాలలో శిష్యులు

విజయవంతంగా చేసిరని తెలుస్తుంది.

"నేను మీకు ఏయే సంగతులు ఆజ్ఞాపించితినో వాటిని గైకొనవలెనని వారికి బోధించుడి" అని యేసు చెప్పెను. బాప్తిస్మము పొందినవారికి ఈ క్రింది సంగుతులు బోధింపబడవలెనని ఆయన భావము:

- ఏదియు విడిచిపెట్టక, యేసు ఆజ్ఞాపించినవన్నియు చేయవలెనని.
- ఆయన ఆజ్ఞాపించినదాని కంటె ఎక్కువ *లేదా* తక్కువ చేయకుండుటకు.
- ఆయన ఆజ్ఞాపించిన*దంతయూ* మార్చకుండ చేయుటకు.
- ఆయన ఏమి *ఆజ్ఞాపించెనో* దానిని ఖచ్చితముగా చేయుటకు.

**మత్తయి 15:7-9; మార్కు 7:7-13**

మత్తయి 15:7-9లో యేసు మానవుల ఆచారములను ఆజ్ఞలను ఖండించాడు. ఆయనను అనుసరించువారికి ఆయన పరిమితులను ఏర్పరచెను, అనగా మనము బోధపై ఆధారపడి ఆచారములను నిర్బంధించి ఆయన ఆజ్ఞలను పాటించాలి. సత్యమునకు వెలుపల ఆరాధించుట – మానవ కల్పిత బోధలో అది కన్పించును – వ్యర్థము మరియు విలువలేనివి, ఆచరించుటకు తగనివై ఉండును.

యేసు యెషయా 29:13 యొక్క ఆలోచనను యూదులకు అన్వయించాడు, "వారు మానవులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు నన్ను వ్యర్థముగా ఆరాధించుదురు" (మార్కు 7:7). ఇశ్రాయేలీయుల ఆత్మ సంబంధమైన గ్రుడ్డితనము, దేవుని వాక్యమునుండి వారిని త్రిప్పివేసెనని యెషయా తెలిపెను. దేవుని బయల్పాటు, చదవగలిగినవారికి మూసివేయబడిన గ్రంథమని మరియు చదువులేనివారికి చదువుటకు అసాధ్యమైనదని వారు భావించేవారు (యెషయా 29:11, 12). దేవుని వాక్యపు జ్ఞానము వారికి లేక మరియు వారి సొంత నియమ నిబంధనల ప్రకారము వారు దేవుని సేవించుటకు వెదకిరి. ఇలాంటి ఆరాధన విలువలేనిదని యేసు పలికెను.

"మీరు దేవుని ఆజ్ఞను విడిచిపెట్టి, మనుష్యుల పారంపర్యాచారమును గైకొనుచున్నారు" మరియు "మీరు మీ పారంపర్యాచారమును గైకొనుటకు దేవుని ఆజ్ఞనను బొత్తిగా నిరాకరించుదురు" (మార్కు 7:8, 9బి) అని మీరు "నియమించిన మీ పారంపర్యము వలన దేవుని వాక్యమును నిరర్థకము చేయుదురు" (మార్కు 7:13ఎ) అని కూడ యేసు యూదులకు చెప్పెను.

**యోహాను 4:20-24**

యేసు ప్రవక్తయని గ్రహించి, యాకోబు బావిదగ్గర సమరయ స్త్రీ ఆరాధనను గురించి ఆయనను ఒక ప్రశ్న అడిగెను. ఆ ప్రశ్న దేవుని ఉనికి సంబంధించినది కాదు, నిజమైన దేవునిని ఆరాధించుటకు ఆరాధన అవరసమా, ఆరాధనలో ఏమి ఉపయోగించాలి లేదా ఆరాధన మోషే ధర్మశాస్త్రము ప్రకారము ఉండవలెనా అని కాదు. ఆమె దేవుని యందు విశ్వాసముగలది. మరియు ఆమె ఆయనను ఆరాధించాలని విశ్వసించెను. ఆమె నిజమైన ఆరాధనయందు ఆసక్తిగలది, దేవుని యిష్టానుసారముగా ఆరాధన ఉండవలెనని

తెలుసుకొనియున్నది. ఆరాధన గురించి ఆమెకు కొంత తెలిసియుండెను మరియు ఆ కాలంలో మోషే ధర్మశాస్త్రము ప్రమాణికమని అంగీకరించెను. ఆరాధనకు సరియైన స్థలమేది అని ఆమె తెలిసికొనగోరుచున్నది.

ఆరాధనలో అన్ని ప్రయత్నములు దేవునికి అంగీకారము కాదని యేసు జవాబు తెలియజేసెను. సమరయులు ఆరాధించినను వారి ప్రయత్నములన్నియు దేవుని సంతోషపరచలేవు. తెలియజేయబడని ఆరాధన అంగీకారం కాని ఆరాధన. సమరయులు దేవుని ఆరాధన తెలియనివారని యేసు ఆమెతో చెప్పెను.

యూదులు అనుసరించు ప్రమాణము ఖచ్చితమైన ప్రమాణము. రక్షణ యూదులలోనుండి మెస్సీయ ద్వారా వచ్చునని యేసు ఆమెతో చెప్పెను. దేవుని బయల్పాటు పాత, క్రొత్త నిబంధనలలో యూదుల ద్వారా అనుగ్రహించబడెను. ఆయన యూదులకు లేఖనములను అప్పగించెను (రోమీయులకు 3:2).

సరియైన లేదా సరికాని ఆరాధన రక్షణను ప్రభావితం చేస్తుంది. రక్షింపబడుటకు ఏమి చేయాలని చర్చించుటగాని పాపములకు క్షమాపణ ఎలా పొందాలనిగాని చర్చించుట లేదు గానీ, దేవునికి అంగీకారమైన ఆరాధనను గురించి యేసు మాట్లాడుచున్నాడు. ఆ సమయంలో దేవుడు ఇశ్రాయేలీయులకు ఏమి తెలియజేసెనో దాని ప్రకారము ఆరాధించుటను తెలుపుచున్నది.

దేవుడు సరియైన ఆరాధననే అంగీకరిస్తాడు. నిజమైన ఆరాధన క్రైస్తవ యుగంలో ఆత్మతో సత్యముతో అర్పింపవలెను (యోహాను 4:23, 24). "ఆత్మతో" అనగా అంతరంగ పురుషునిలో ఆరాధన పుట్టాలి. బాహ్య వ్యక్తీకరణలు చాలవు. ఆరాధన మానవ ఆత్మను హీనపరచు గ్రుడ్డులోని తెలుపు, పచ్చసోన లేకుండా చేసినట్టు ఆరాధన మానవ ఆత్మను శూన్యం చేస్తుంది. అది ఎలా ఉంటుందంటే, ఇతర ప్రపంచములు లేదా వేరొక స్త్రీ అతని మనస్సులో ఉన్ననూ వాటిని శూన్యం చేసి తన భార్యను ప్రేమించుచున్నాను అని చెప్పే తన భార్యను ప్రేమించే భర్త అంతటి శూన్యంగా ఉంటుంది. "సత్యముతో" అనగా యేసు బోధలకు అనుగుణముగా అని అర్థం. ధర్మశాస్త్రమునకు అనుగుణము అని కాదు. ధర్మశాస్త్రము (ఛాయ; హెబ్రీయులకు 10:1) మోషే ద్వారా వచ్చెను. యేసు సత్యమును తీసుకొనివచ్చెను (యోహాను 1:17), ఆయన సంపూర్ణ సత్యము (యోహాను 1:14; 14:6; ఎఫెసీయులకు 4:21). ఆయన వాక్యమందు నిలిచి యుండెడివారు సత్యమును కనుగొనగలరు. సత్యమందున్నవారు యేసు మాటలను వింటారు (యోహాను 8:31, 32; 17:17; 18:37బి).

అంత ప్రాముఖ్యం కానట్టు కనిపించే దేవుని ఆజ్ఞ కూడ ప్రాముఖ్యమైనదిని యేసు బోధించెను. "మిక్కిలి కొంచెములో నమ్మకముగా ఉండువాడు ఎక్కువలోను నమ్మకముగా ఉండును; మిక్కిలి కొంచెములో అన్యాయముగా ఉండువాడు ఎక్కువలోనూ అన్యాయముగా ఉండును" (లూకా 16:10).

**యోహాను 16:13, 14**

అపొస్తలులకు, క్రొత్త నిబంధన ప్రవక్తలకు పరిశుద్ధాత్మ ద్వారా సమస్త సత్యమును యేసు బయలుపరచెను (ఎఫెసీయులకు 2:20; 3:3–5). యింక ఏ సత్యము బయల్పరచబడనవసరము లేదు, మరియు యింక ఎక్కువ సత్యము అవసరము లేదు,

> అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన **ఆత్మ** వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. ఆయన నావాటిలోనివి తీసికొని మీకు చెలియజేయును గనుక నన్ను మహిమపరచును (యోహాను 16:13, 14) అని యేసు వాగ్దానం చేశాడు.

సర్వసత్యములోనికి నడిపించవలసినవారు అపొస్తలులు. ఈ విషయమును ఈ ప్రతిపాదన చేసిన సన్నివేశం విశదపరచుతుంది. అది యేసు ఆఖరి రాత్రి భోజనమును ఆచరించిన పస్కాపండుగ రోజు. భోజనము అయిన వెంటనే అపొస్తలుల పాదములు కడుగుటకు బల్లయొద్దనుండి యేసు లేచెను (యోహాను 13:4, 5); ఆ సమయమున దీనికి సాక్ష్యముగా వారు పండ్రెండుమంది మాత్రమే ఆయనతోకూడ ఉండిరి (మత్తయి 26:20; మార్కు 14:17; లూకా 22:14). "నేను మీయొద్ద ఉండగానే ఈ మాటలు మీతో చెప్పితిని" (యోహాను 14:25) అని కూడ యేసు వారితో చెప్పెను; "మీరు మొదటనుండి నాయొద్ద ఉన్నవారు గనుక మీరును సాక్ష్యమిత్తురు" (యోహాను 15:27); "నేను మీతోకూడ ఉంటిని గనుక మొదటనే వీటిని మీతో చెప్పలేదు" (యోహాను 16:4బి).

### రోమీయులకు 10:1-3

దేవునికి ప్రత్యుత్తరమిచ్చుచు శ్రద్ధగా ఆయన బోధనలు అనుసరించవలెనని ఆయన కోరుతున్నాడు. మనము సొంతగా చేయుటకు ఆయన మనకు స్వాతంత్ర్యము నివ్వడు. దేవుని చిత్తము లేకుండ ప్రవర్తిస్తే, మనము అజ్ఞానముతో ప్రవర్తించుచున్నాము. ఇదే ఇశ్రాయేలీయులు చేయుచుండిరి. వారు వారి అజ్ఞానములో ప్రవర్తించుచున్నారని *వారి రక్షణ కొరకై* పౌలు ప్రార్థన గుర్తుజేస్తుంది:

> వారు దేవునియందు ఆసక్తిగలవారని వారినిగూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను; అయినను వారి ఆసక్తి జ్ఞానానుసారమైనది కాదు. ఏలయనగా వారు దేవుని నీతినెరుగక తమ స్వనీతిని స్థాపింపబూనుకొనుచు దేవుని నీతికి లోబడలేదు (రోమీయులకు 10:2, 3).

మనము దేవుని చిత్తమును చేస్తున్నామో లేదో తెలుసుకొనుటకు ఆయన వెల్లడి చేసినవాటియందు ఏమి ఆజ్ఞాపించాడో దానిని చేయుటయే ఏకైక మార్గమైయున్నది.

### 2 కొరింథీయులకు 11:3

కొరింథీయులు క్రీస్తునుండి త్రోవ తప్పుతారేమోనని పౌలు భయపడ్డాడు. క్రైస్తవులు నిలిచియుండవలసిన అభీష్టపరిమాణములు లేకపోయినట్టయితే ఎవ్వరూ త్రోవతప్పేవీలుండదు. 2 కొరింథీయులకు 11:3లో ప్రస్తావించిన "సరళత" మరియు "పవిత్రతకు" యేసు మాత్రమే మన ప్రభువని మరియు అధికార పూర్వకమైన బోధకుడనే విశ్వాసమందు నిలిసియుండ అవసరమైయుంది. నిష్కళంకముగా జీవించుట మరియు నిజమైన బోధకు సమర్పణను ఈ రెండు పదములు సూచిస్తాయి. వారు యేసును నమ్మినట్లు చేయబడి మాని మరొక "యేసును," మరొక "ఆత్మను" లేదా మరొక "సువార్తను" వెంబడించుదురేమో అని పౌలు భయపడుతున్నట్టు వివరముగా తెలిపాడు (2 కొరింథీయులకు 11:4). తరువాత, "దొంగ

అపొస్తలులు," మరియు "మోసగాండ్రగు పనివారిని" గూర్చి తెలిపెను (2 కొరింథీయులకు 11:13). క్రైస్తవులు ఇతర బోధకులను గాక యేసును, యితర ఆత్మలనుగాక పరిశుద్ధాత్మను, ఇతర సువార్త గాక, కొరింథీయులు పొందిన సువార్తను వెంబడించాలి.

**గలతీయులకు 1:7, 8**

యేసు బోధ పరిమితితో కూడింది. క్రీస్తు యేసు సువార్త మాత్రమే బోధించాలి. సువార్త (*euaggelion,* "good news") యేసు యొక్క మరణము, సమాధి మరియు పునరుత్థానపు సమాచారమైయున్నది; కాని దీనికంటె ఎక్కువ ఉన్నది. గలతీయులకు వ్రాసిన పత్రికలో సున్నతి ఆచరించవలెనా లేదా అనేదానిని గూర్చి (గలతీయులకు 2:2-5) మరియు యూదులు అన్యజనులతో సహవాసము చేయుటను గూర్చి (గలతీయులకు 2:11-14) చేర్చబడింది. "సువార్త" అను పదములో యితర ఉపదేశములు కూడ ఉన్నదని బోధించబడింది. రాజ్య సువార్తలో పశ్చాత్తాపము అవసరమైయున్నదని తెలుపుతుంది (మత్తయి 4:17; మార్కు 1:15). సువార్త సందేశము మనుష్యుల రహస్యములను తీర్పు తీర్చునని మనకు చెబుతుంది (రోమీయులకు 2:16). క్రైస్తవుల జీవితాలు సువార్త సూత్రములకు అనుగుణ్యంగా ఉంటాయి (ఫిలిప్పీయులకు 1:27). సువార్త క్రైస్తవ నిరీక్షణను కల్గి ఉంటుంది (కొలొస్సయులకు 1:23), అలాగే రకరకాల నైతిక అవసరములుగలదై ఉంటుంది (2 తిమోతి 1:8-11). సువార్త అక్షయతను వెలుగులోనికి తెచ్చెను (2 తిమోతి 1:10). - రక్షణను అనుగ్రహించు యేసు కార్యములను గూర్చి తప్పుగా బోధించినా, రక్షణను పొందుటకు అవసరమైన వాటిని లేక రక్షింపబడినవారు జీవించవలసిన జీవితమును గూర్చి తప్పుగా బోధించిన వారెవరైనా యేసు సిద్ధాంతాలనుండి తొలగిపోయి తప్పులో ఉన్నారు. ఎవరైతే సువార్త బోధను వక్రీకరిస్తారో వారు పరలోకపు శాపము క్రింద ఉంటారు (గలతీయులకు 1:8, 9).

**కొలొస్సయులకు 2:18-23**

తప్పుత్రోవను పట్టించు బోధకులు మన బహుమానమును అపహరింపవచ్చును. సంఘమునకు శిరస్సు అయిన క్రీస్తును హత్తుకోకుండ జ్ఞానమువలన ఉప్పొంగేవారి పద్ధతులవలన తప్పుత్రోవ పట్టించు బోధకులవలన మన బహుమానము అపహరింపబడవచ్చును (18, 19 వచనాలు). మనము క్రీస్తుతోకూడ లోకము యొక్క మూల పాఠముల విషయమై మృతిబొందాలి (20 వచనం), మనుష్యుల యొక్క ఆజ్ఞలు మరియు బోధలైయున్నవి (22 వచనం). ఇవి "మనం సొంతగా మతమును ("స్వేచ్ఛారాధన"; KJV; "తనకు తానుగా విధించుకొన్న ఆరాధన"; NIV; 23 వచనం) ఏర్పాటు చేసుకొనుటకు" నడిపించిన జ్ఞానంపై ఆధారపడియుంటాయి.

యేసు బోధకే మన ఆచారములను పరిమితి చేసుకొనవలెను. మానవ జ్ఞానంచేత కల్పింపబడిన ఉపదేశములను మనం అనుసరించరాదు.

**2 తిమోతి 3:16, 17**

బాల్యమునుండి తిమోతి ఎరిగిన లేఖనములు పాత నిబంధనవై యుండవచ్చును (2 తిమోతి 3:15); "లేఖనములన్నియు" అని 2 తిమోతి 3:16లో పౌలు సూచించునది

పాత నిబంధనకంటె ఎక్కువ లేఖనములను సూచించాడని అర్థం. విలియం హెండ్రిక్‌సన్ ఈ విధముగా వివరించారు,

> "పరిశుద్ధ లేఖనములు" అని 15వ వచనములో మరియు 16వ వచనంలో "లేఖనములన్నియు" అని పౌలు ఉపయోగించినప్పుడు, పాత నిబంధనకు (15 వచనం) దైవం వలన ప్రేరేపింపబడిన లేఖనములు అని చెప్పుటకు అర్హతగల వాటినన్నిటికి గల వ్యత్యాసమును చూపించుటకు అలా చేసాడు (16 వచనం). పాత నిబంధన లేఖనములకంటె అధికమైనవాటిని సూచించాడు.[2]

పౌలు రచనలను పేతురు గౌరవించినట్లు క్రొత్త నిబంధన రచనలను లేఖనములుగా మనము గౌరవించాలి (2 పేతురు 3:16).

దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము పూర్తిగా వెల్లడిచేయబడి, "ఉపదేశించుటకు, ఖండించుటకు, తప్పు దిద్దుటకు, నీతియందు శిక్షచేయుటకు ప్రయోజనకరమైయున్నది" (2 తిమోతి 3:16). ఏ యితర రాతలకు అట్టి అధికారము లేక సంపూర్ణత లేదు.

ఈ దేవుని రచనలను అనుసరించువాడు, ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి ఉంటాడు (2 తిమోతి 3:17). ఇతర ప్రమాణము అవసరము లేదు. దేవునితో సరియైన సంబంధమును కలిగియుండుటకు ఒక క్రైస్తవుడు చేయవలసినవన్నియు లేఖనములలో ఉన్నాయి. దేవుని సంతోషింపచేయుటకు క్రైస్తవులకు కావలసినవన్నియు క్రొత్త నిబంధనలో ఉన్నాయనే సత్యాన్ని బైబిలు ఉపదేశమునకు వెలుపట దేవుని సేవించుటకు వెదకువారు నిరాకరిస్తున్నారు.

**తీతు 1:10-14**

ఉపదేశింపకూడని వాటిని ఉపదేశించే మోసగాండ్రను పౌలు హెచ్చరించాడు (10, 11 వచనాలు). నిజమైన, పవిత్రమైన, భ్రష్టుపట్టించిన ఉపదేశమువలన మాత్రమే, యిట్టి వారిని విశ్వాస విషయములో స్వస్థలగు నిమిత్తము కఠినముగా గద్దించాలి (13 వచనం).

మనము సత్యమునుండి తొలిగిపోవునట్లు మనుష్యుల కట్టడలను, ఆజ్ఞలను, మనము లక్ష్యపెట్టకుండ (1:14), దేవునికి మరియు సత్యమునకు చేసే సేవను యేసు బయలుపరిచిన వాటికి పరితిచేసుకొనవలెను (యోహాను 1:17; 8:31, 32; 14:6).

**హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 2:10; 12:2**

యేసు క్రైస్తవ విశ్వాసమునకు "కర్త." శిష్యుల బోధకు మూలాధారమైన వాని బోధలు అనుసరించవలెను. ఆయన క్రైస్తవ విశ్వాసమును ప్రారంభించుటయే గాక (హెబ్రీయులకు 2:3), దానిని సంపూర్తి చేసినవాడు ఆయనే. ఒక ఆచారము క్రొత్త నిబంధనలో బయల్పరచబడినట్లు, యేసు బోధలో లేనట్టయితే, అప్పుడు యేసు ఆ ఆచారమునకు కర్తకాదు. అన్ని కాలములకు క్రైస్తవులకొరకైన బోధను ఆయన పూర్తిగా వెల్లడిపరచెను (యూదా 3).

**2 యోహాను 9**

"క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడు దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని

అంగీకరించువాడు" (2 యోహాను 9). పై వ్యాఖ్యానంలోని క్రియా పదములు జరుగుచున్న పనిని తెలుపుతుంది. ఎవరు యేసు బోధల మేర దాటి కొనసాగుతుంటారో, వాటిలో నిలిచియుండకుండ ఉంటారో వారు దేవుని కల్గినవారు కాదు. ఎవరు ఆయన బోధలకు అనుగుణంగా మేరలో ఉండి నడుచుకుంటారో వారు తండ్రిని కుమారుని కల్గియుంటారు.

**ప్రకటన 22:18, 19**

ఈ గ్రంథములో వ్రాయబడినవాటిని ఎవడైనా కలిపినను లేక తీసివేసినను వానికి కఠినమైన శిక్ష ఉన్నదని బైబిలు ముగింపు వాక్యములో తెలుపుతుంది. ఇది ప్రకటన ఒక్క దానికి మాత్రమే సూచిస్తుందా? ఎవడైన బైబిల్లో ఒక పుస్తకములోనుండి కలుపుట లేదా, తీసివేయుటను దేవునికి ఇష్టపడకపోయినట్టయితే, అదే విధముగా ఇది బైబిల్లోని ఇతర పుస్తకములకు కూడ చెందదా? దేవుని గ్రంథంగా ప్రకటన పుస్తకమునకు సంబంధించి ప్రతిదీ సత్యమైతే, దేవుని ఇతర పుస్తకములలో బయల్పాటుకు కూడ యిది సత్యమై ఉంటుంది: ఆయన బోధలనుండి ఏదియూ మనము కలుపకూడదు లేదా తీసివేయకూడదు.

## ముగింపు

యేసు బోధను విడిచి బయటకు వెళ్ళువాడు దేవుని కల్గియుండడు, కాని ఎవరు ఆయన బోధయందు నిలిచియుంటారో వారు తండ్రిని కుమారుని కల్గియుంటారు. ఈ విషయంలో ఉదాహరణగా ఒక వృత్తము గీసి వివరించగలము. క్రొత్త నిబంధనలో ఉన్న యేసు బోధలు ఒక వృత్తములో వ్రాయుము. ఆయన బోధలో లేని ఆచారములను వృత్తమునకు బయట వ్రాయాలి. ప్రభు రాత్రి భోజనము దీనికి ఉదాహరణగా ఉపయోగించవచ్చు. యేసు ఏది ఎన్నిక చేసెనో దానిని వృత్తంలో వ్రాయండి: "రొట్టె" మరియు "ద్రాక్షారసము" (మత్తయి 26:26–29). "వెన్న," "హామ్," మరియు "యాపిల్ రసము" వృత్తమునకు బయట వ్రాయండి. వృత్తము లోపలివి ఆచరించాలి (అభ్యసించాలి). వృత్తమునకు వెలుపలివి విసర్జించాలి, అవి యేసు బోధలో లేవు గనుక, ఒక వ్యక్తి వృత్తమునకు బయటవి ఆచరిస్తే అతను యేసు బోధను దాటి వెళుతున్నాడు.

---

సూచనలు

[1]John L. Girardeau, *Instrumental Music in the Public Worship of the Church* (Havertown, Pa.: New Covenant Publication Society, 1888; reprint, 1983), 3. [2]William Hendriksen, *I-II Timothy,* New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House, 1974), 300.

---

## క్రైస్తవుల కొరకైన ఆజ్ఞలను గుర్తించుట

ఆయన దేవుడు తనకు విధేయులగుటకు ఇశ్రాయేలీయులు తెలుసుకొనవలసినవాటినన్నిటిని మోషె ద్వారా బయలుపరచెను. అదేవిధముగా, యేసు సమస్త బోధను అపొస్తలులు పొందుదురని ఆయన వారికి వాగ్దానము చేసెను. దేవుడు యేసు ద్వారా తనను తాను బయలు పరచుకొనెను (హెబ్రీయులకు 1:1, 2; యోహాను 12:49, 50 కూడ చూడు), తర్వాత ఆయన సర్వసత్యమును అపొస్తలులకు ఇచ్చెను.

ఇశ్రాయలీయుల కొరకు మోషే ధర్మశాస్త్రము ఉండెను. క్రైస్తవులు క్రీస్తుయొక్క నూతన నిబంధన క్రింద ఉన్నారు. ధర్మశాస్త్రము బాల శిక్షకునివలె ప్రజలను క్రీస్తునొద్దకు నడిపించుటకు ఉన్నప్పటికీ (గలతీయులకు 3:24, 25). మనము ఎలా ఆరాధించవలెనో నేర్చుకొనుటకు పాత నిబంధనను చూడరాదు. రెండు నిబంధనలో బోధింపబడిన పద్ధతులు వేరువేరైయున్నందున ధర్మశాస్త్రము ప్రకారము సంగీత పరికరములు ఉపయోగించినను, క్రొత్త నిబంధన ఆరాధనలో సంగీత పరికరములు చేర్చకపోవడం ఆశ్చర్యం *అన్పించదు.* దేవుడు మరియు యేసు యుగయుగములకు ఎప్పటికీ ఒక్కటే రీతిగా ఉంటారు (హెబ్రీయులకు 13:8), కానీ వారు ఇశ్రాయేలీయులనుండి ఏమి కోరారో క్రొత్త నిబంధనలో సమస్త దేశములలోని క్రైస్తవులను కోరేది అదే కాదు.

పాత నిబంధనలో తెలియజేయబడిన పద్ధతులు, క్రైస్తవులకు కూడ చెందాలని తెలుపదు. ఏకరీతిగా ఉండుటకు, ధర్మశాస్త్రమును ఆచరించువాడు. ధర్మశాస్త్రమంతటిని ఆచరింప బద్ధుడైయున్నాడు. ఒకడు బద్ధుడై ఉంటే అందరూ బద్ధులైయున్నారు. ఈ సంగతిని పౌలు గలతీ పత్రిక 5:3లో తెలిపాడు.

క్రైస్తవ యుగంలో, ప్రవక్తలు మరియు అపొస్తలుల ద్వారా దేవుని సందేశం సంపూర్ణంగా బయలుపరచబడెను. ఆయన ఆజ్ఞలను సంపూర్ణంగా గ్రహించగలం (ఎఫెసీయులకు 3:4, 5 చూడు).

ఏ ఇతర పుస్తకములో దేవుని వర్తమానము లేదు. జీవమునకును భక్తికి కావలసిన వాటన్నిటిని బైబిలు కల్గియున్నది గనుక బైబిలును జాగ్రత్తగా చదివి అనుసరించవలెను (2 పేతురు 1:3). ఒక మత సంబంధమైన కార్యమును క్రొత్త నిబంధనలో బోధింపకపోతే అది ఆచరించవలసియుండదు. క్రొత్త నిబంధనలో ఆచరింపబడని దానిని ఎవరు ప్రవేశపెట్టుదురో, ఆ విధముగా చేయడంవలన, మనము ఆరాధించుటకు దేవుడు ఎదురుచూసే ప్రతిదీ చేయవలసిన పనిలేదని సూచిస్తున్నాం.

మనము దేవుని ఆరాధించుటకు కావలసిన దంతయూ లేఖనము కల్గియున్నది. అది మనలను పరిపూర్ణులుగా, సామర్థ్యముగల నిపుణులుగా, మరియు ప్రతి సత్కార్యమునకు సిద్ధపరచును (2 తిమోతి 3:16, 17). బయలుపరచబడిన దానికి ఎవరు కలుపుతారో వారు సంపూర్ణమైనదానికి కలుపుతున్నారు. లేఖనములలో లేని ఏ పద్ధతియైన యేసునుండి వచ్చినది కాదు, మరియు ఆచరించవలసిన పనిలేదు. యేసే మార్గమైయున్నందున, మరియు ఆయన బయల్పాటు సంపూర్ణంగా క్రొత్త నిబంధనలో ఉంది గనుక ఇతర బోధలు మనకు అవసరములేదు. ఆయన బయలుపరచిన పద్ధతులను గాక ఏ యితర ఆచారములను ఈ మన ఆరాధనలో చేర్చకూడదు.

ఒక ఆచారము దైవికమైన అనుమతి ఉన్నదా లేదా అని నిర్ధారించుటకు మనము నాలుగు అధికార సూత్రములను పునర్విమర్శ చేయాలి: (1) దేవుడు ఏమి ఆజ్ఞాపించాడో, దానికి మనము విధేయుత చూపాలి; (2) దేవుడు ఏమి నిషేధించాడో, మనం దానిని త్రోసివేయాలి; (3) దేవుడు ఏమి కోరుకున్నాడు దానికి బద్ధులమైయుండాలి; (4) ఎక్కడేమి ప్రత్యేకించి చెప్పలేదో, మనకు గల స్వాతంత్ర్యముతో ఇతరులను దృష్టిలో ఉంచుకొని విచక్షణతో వ్యవహరించాలి.